15న 'పేట'కు సీఎం రాక

పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ లింగయ్య

నారాయణపేట, ఏప్రిల్ 12 : ఈనెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నారాయణపేటకు రానున్నారు. శుక్రవారం సీఎం పర్యటన, బందోబస్తు ఏర్పాట్లను డీఎస్పీ లింగయ్య పరిశీలించారు. సింగారం చౌరస్తా వద్ద హెలిప్యాడ్, మినీ స్టేడియం గ్రౌండ్‌లో పబ్లిక్ సమావేశం, పేట శివారులో పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లు, బారికేడ్ల నిర్వహణ, ట్రాఫిక్ డైవర్షన్, భద్రతా పరమైన అంశాలపై పోలీసులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

జడ్చర్ల(బాలానగర్), ఏప్రిల్ 12 : బాలానగర్ మండలం చెన్నంగులగడ్డతండాలో ఈ నెల 21వతేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని తండావాసులు ఆహ్వానించారు. శుక్రవారం పెద్దాపల్లి చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని తండావాసులు కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో తండావాసులు ఉన్నారు.

రూ.36లక్షలు కాజేసిన కేటుగాళ్లు

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 12 : జడ్చర్ల పట్టణంలోని బాబ్జీస్టీట్‌కాలనీకి చెందిన సునీల్ జవహర్ వాట్సాప్ నెంబర్‌ను గుర్తు తెలియని వ్యక్తి (9373059986 నెంబర్‌తో) మార్చి 27వ తేదీన గ్రోవెన్షన్ మీడియా ఎఫ్ఎక్స్972 పేరుతో ఉన్న గ్రూప్‌లో యాడ్ చేశాడు. అప్పటికే ఆ గ్రూపులో మరికొంతమంది నంబర్లు ఉన్నాయి. గ్రూప్‌లో వివిధ రకాల ప్రొడక్ట్‌లు, ప్రాంతాల గురించి గూగుల్ రివ్యూలు ఇవ్వాలని, ఒక్కో రివ్యూకు రూ.150 చొప్పున డబ్బులిస్తామని నమ్మబలికారు. దాన్ని సునీల్ జవహర్ నమ్మి పలు రివ్యూలివ్వగా అతని బ్యాంకు ఖాతాలో కొన్ని డబ్బులు జమ చేశారు. కొన్ని రోజుల తర్వాత మరో టెలిగ్రామ్ గ్రూప్ లింక్ పంపించి వివిధ టాస్క్‌ల రూపంలో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులొస్తాయని చెప్పారు. దీన్ని నమ్మిన బాధితుడు మొదటగా రూ.2వేలు పెట్టి టాస్క్ పూర్తి చేయగా, ఓ అకౌంట్ క్రియేట్ చేసి అందులో రూ.3,800 వేసినట్లు చూపించారు. ఈక్రమంలో బాధితుడు విడుతల వారీగా మొత్తం రూ.36లక్షలకు పైగా డబ్బు పెట్టి టాస్క్‌లు పూర్తి చేశాడు. డబ్బు చెల్లించాలని బాధితుడు అడగగా మళ్లీ రూ.10లక్షలు ఇన్వెస్ట్ చేస్తే మొత్తం చెల్లిస్తామని చెప్పడంతో బాధితుడు మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కొంతకాలంగా జడ్చర్ల పీఎస్ పరిధిలో పలువురు బాధితులు ఆన్‌లైన్ కేటుగాళ్ల చేతిలో మోసపోయి పోలీసులను ఆశ్రయిస్తున్న ఘటనలు తరచుగా వెలుగుచూస్తున్నాయి.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా కేటుగాళ్లు ఆన్‌లైన్‌లో టాస్క్‌ల పేరుతో ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు.

పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు రానీయొద్దు

- సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

చిన్నారులతో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 12 : బాలసదనం, వయోవృద్ధుల వసతిగృహంలో పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలసదనం, వయోవృద్ధుల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యాలు, పరిసరాలు, తాగునీరు, సీసీ టీవీ పుటేజీ రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారో లేదో పిల్లలు, వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. బెడ్‌షీట్, గదులను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు.

ప్రతి ఇంటికీ ఇంకుడుగుంత తప్పనిసరి

జియో ట్యాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జడ్చర్ల, ఏప్రిల్ 12 : జడ్చర్ల మున్సిపాలిటీలో ఇంకుడుగుంతలపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపాలిటీ పరిధిలో 350గజాలల్లో నిర్మించుకున్న ఇండ్లల్లో ఇంకుడు గుంతలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంకుడగుంతలు లేని వారికి నోటీసులను జారీ చేశారు. ఇంకుడు గుంతలు ఉన్న ఇంటికి జియోట్యాగింగ్ చేశారు. వేసవిలో నీటి కొరత ఏర్పడుతుందని, ప్రతిఒక్కరూ ఇంకుడు గుంతలను తీసుకోవడం వల్ల వర్షాలు వచ్చిన సమయంలో నీరు అందులోకి వెళ్లి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంటుందని కమిషనర్ రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు కృష్ణయ్య, రమేశ్, మణిదీప్, శ్రావణ్, అశ్విని, ఆర్పీలు స్వాతి, సునీత, శశికళ, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

మాగనూరు, ఏప్రిల్ 12 : ఉమ్మడి మాగనూరు, కృష్ణ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని కృష్ణ మండలంలోని హిందూపూర్ బసవేశ్వర కల్యాణ మండపంలో శనివారం నిర్వహించనున్నట్లు మండలాధ్యక్షుడు ఎల్లారెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అంజయ్యయాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, హాజరవుతారన్నారు.

దేవరకద్రలో..

దేవరకద్ర, ఏప్రిల్ 12 : నియోజవర్గ కేంద్రంలో శనివారం దేవరకద్ర, కొకుంట్ల మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని స్థానిక శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి దేవరకద్ర మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశామని, ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, ఏప్రిల్ 12 : మండలంలోని గురుకుంటలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో శనివారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు మాడెమోని నర్సింహులు, జెడ్పీటీసీ ముత్యాల రవీందర్‌రెడ్డి తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 14వ తేదీన మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించే సమావేశంపై గురుకుంటలో చర్చించడం జరుగుతుందన్నారు. మండలంలోని ముఖ్యనాయకులు

హన్వాడ : సమావేశం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సమావేశానికి హాజరు కావాలని కోరారు.

హన్వాడలో..

హన్వాడ, ఏప్రిల్ 12 : ఈనెల 15వ తేదీన బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం కార్యకర్తల సమావేశం కోసం హన్వాడలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 35గ్రామ పంచాయతీల్లో ప్రతి కార్యకర్తలు హాజరుకావాలన్నారు. సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో ఎంపీపీ బాలరాజు, నాయకులు రామణారెడ్డి, లక్ష్మయ్య, జంబులయ్య, శివకుమార్, చెన్నయ్య, శ్రీనివాసులు, యాదయ్య, అనంద్, ఖాజాగౌడ్, మాధవులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

మిడ్జిల్ : మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

భూత్పూర్, ఏప్రిల్ 12 : పాలమూరు పార్లమెంటు అభ్యర్థిగా తాను గెలిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కేఎంఆర్ ఫంక్షన్‌హాల్లో కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశాన్ని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ అందజేస్తామని తెలిపారు. ముఖ్యంగా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే అమలుచేసే అంశాలను వివరిస్తూ డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగులకు ఏడాదికి రూ.లక్ష, ప్రతి పేద మహిళకు ఏడాదికి రూ.లక్ష, రైతులకు పెట్టుబడికి 50శాతం అదనంగా స్వామినాథన్ కమిటీ ద్వారా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, గోపర్ధన్‌గౌడ్, విజయ్, హర్యానాయక్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మిడ్జిల్, ఏప్రిల్ 12 : ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉమ్మడి మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వంలో నిత్యావసర, డీజిల్ ధరల పెంపుతో పేదలు, సామాన్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేశారని గుర్తుచేశారు. ప్రజలు బీజేపీని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జర్నలిస్టులకు ఇండ్లు, హెల్త్‌కార్డులు, పిల్లలకు విద్య తదితర సమస్యలపై విద్యా, అక్రిడేషన్ తదితర సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకులంగా ఉన్నారన్నారు. అనంతరం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు రబ్బానీ, తిరుపతిరెడ్డి, వెంకటయ్య, గౌస్, భీమయ్య గౌడ్, సాయిలు తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూం పరిశీలన

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 12 : శాసనమండలి ఉపఎన్నికకు సంబంధించి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో భద్రపర్చిన బ్యాలెట్ బాక్సుల స్ట్రాంగ్ రూంను శుక్రవారం కలెక్టర్ రవినాయక్ తనిఖీ చేశారు. పకడ్బందీ పర్యవేక్షణ, భద్రత చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

మార్కెట్‌లోకి పల్సర్ అప్‌గ్రేడ్ మాడల్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 12 : ప్రముఖ టూ వీలర్ మోటర్ సైకిల్ బజాజ్ ఆధ్వర్యంలో అప్‌గ్రేడ్ పల్సర్ సరికొత్త మాడల్‌ను శుక్రవారం మహబూబ్‌నగర్‌లో ప్రారంభించారు. పల్సర్ 150 అప్‌గ్రేడ్ మాడల్‌ను లాంచ్ చేయగా, దీని ధర ఎక్స్‌షోరూం ధర రూ.1,12,301లుగా నిర్ణయించారు. బ్లూ టూత్, యూఎస్‌బీ డిజిటల్ కన్సల్‌తో ఆకర్షణీయంగా మూడు వేరియంట్ రంగుల్లో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, బజాజ్ మేనేజర్ వెంకట్రాంరెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పల్సర్ బైక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

సీఎం కుర్చీకే గ్యారెంటీలేదు..

- ఆరు గ్యారెంటీలు ఎలా నెరవేరుస్తారు?
- కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయం
- బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 12 : సీఎం రేవంత్‌రెడ్డికే గ్యారెంటీ లేదని.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలు దేవుడెరుగని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయినపటి నుంచి ఎప్పుడు కుర్చీ ఊడుతుందోననే భయం పట్టుకుందని, ఆ భయంతోనే నాపై కుట్రలు చేస్తున్నారని ప్రజల్లో సంపతి పొందడానికి డ్రామాలాడుతున్నారన్నారు. పంటలు ఎండి రైతులు ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉంటే కనీసం పట్టింపు లేకుండా పార్టీ ఫిరాయింపులకు ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రైతులకు ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పి నేడు పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ లేదు.. రాహుల్ ప్రధాని అయ్యే దిలేదని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల కోసం ఆరుగ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి నేడు మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తేనే అమలు సాధ్యమని చోప్పడం నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డి ఇంకా గల్లీ లీడర్‌గానే భావిస్తున్నారని, నోటికి ఏదొస్తే అది మాట్లాడితే ప్రజలు సహించరన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, కొండయ్య, బంగారు శృతి, యాదయ్య పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యం

- కేసు నమోదు

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 12 : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని నాగసాలకు చెందిన బొగ్గ అశోక్(20) ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గాలించినా ఆచూకీ లభించలేదని యువకుడి కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే మండలంలోని ఉదండాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్ ఈనెల 11వ తేదీన తన భార్యతో కలిసి గొర్రెలను మేపేందుకు వెళ్లగా, తమ ఇద్దరు కూతుర్లు ఇంటి దగ్గరే ఉన్నారు. అదే రోజు సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా, పెద్ద కుమార్తె(16) కనిపించలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా, గతంలోనూ తన కుమార్తెను ఇదే గ్రామానికి చెందిన నాగరాజు అనే యువకుడు తీసుకెళ్లిన ఘటనపై జడ్చర్ల పోలీసుస్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. తమ కూతురు అదృశ్యమవటంపై నాగరాజు అనే యువకుడిపై అనుమానం ఉన్నట్లు యువతి తండ్రి మల్లేశ్ శుక్రవారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వేర్వేరుగా వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ స్థాయికి ఎదగాలి

బ్రౌంజ్ మెడల్ సాధించిన క్రీడాకారుడికి నగదు అందజేస్తున్న సీఐ

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 12 : జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగాలని సీఐ శివశంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 16, 18, 20 విభాగాల్లో మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ పరుగుపందెం పోటీలను నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ పోటీలను సీఐ శివకుమార్ ప్రారంభించి మాట్లాడుతూ క్రీడాకారులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28న సూర్యాపేటలోని ఎస్‌వీడిగ్రీ కళాశాల మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం గత నెలలో గుజరాత్ లో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ నేషనల్ అథ్లెటిక్స్ ట్రయాథ్లెన్ పోటీల్లో బ్రౌంజ్ మెడల్ సాధించిన బస్వంత్‌కు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ తరపున రూ.10వేల నగదును అందజేశారు.

కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, కోశాధికారి అమరేశ్, కోచ్‌లు జగదీశ్, అరవింద్, శ్రీలత, పీఈటీలు రత్నయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మక్తల్ టౌన్, ఏప్రిల్ 12 : సమ్మర్ కరాటే శిక్షణ తరగతులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు డ్రాగన్ చోటాఖాన్ కరాటే స్పోర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు శాలంబింగ్ ఉమర్ అన్నారు. శుక్రవారం మక్తల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రాగన్ చోటా ఖాన్ కరాటే జిల్లా అధ్యక్షుడు మహెముద్దీన్ సహకారంతో సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. నారాయణపేట, కోస్గి, మద్దూరు, మక్తల్ ప్రాంతాల్లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉడిత్యాలలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

జడ్చర్ల(బాలానగర్), ఏప్రిల్ 12 : బాలానగర్ మండలం ఉడిత్యాలలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీరామ, సీత, లక్ష్మణ, ఆంజనేయ, కుమారస్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తుండగా, కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

అధికార పార్టీకి ఎన్నికల కోడ్ వర్తించదా?

మక్తల్ టౌన్, ఏప్రిల్ 12 : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. మాగనూరు మండలం ఉజ్జల్లిలో బోర్ డ్రిల్లింగ్‌ను శుక్రవారం అధికారులు నిర్వహించగా, కాంగ్రెస్ నాయకులు కూడా అక్కడికి వెళ్లి ఫొటోలకు ఫోజులిచ్చారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

14 నుంచి ఉచిత శిక్షణ

పాలమూరు, ఏప్రిల్ 12 : బీసీ మేధావుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14నుంచి పాలిటెక్నిక్, టీఎస్ఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంఘం అధ్యక్షుడు పాండురంగం, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ విద్యార్థులు స ద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని నవభారతి విద్యాలయంలో కోచింగ్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 9396968280 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలన్నారు.

శ్రీరాముడి జీవితం మానవాళికి ఆదర్శం

ఊట్కూర్, ఏప్రిల్ 12 : శ్రీరాముడి జీవితం సర్వ మానవాళికి ఆదర్శనీయమని టీటీడీ ధార్మిక ప్రచార సమితి ఉపన్యాసకుడు కృష్ణయ్య అన్నారు. మండలంలోని బిజ్వారంలో శుక్రవారం 'శ్రీరాముడు ధర్మ స్వరూపుడు' అనే అంశంపై ధార్మిక ప్రవచనం చేశారు. రామాయణంలోని శ్రీ రాముడి ధర్మ గుణాలను వివరించారు. ప్రతి ఒక్కరూ శ్రీరాముడి జీవిత విశిష్టతను తెలుసుకొని అశాశ్వతమైన సుఖాల కోసం కాకుండా ధర్మ రక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీటీడీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యనిర్వాహక అధికారి ఉత్తరాపల్లి రామాచారి, హెచ్.నర్సింహ, వెంకప్పగౌడ్, మహేశ్‌గౌడ్ ఉన్నారు.

బ్యాటరీ పరిశ్రమకు వ్యతిరేకంగా దీక్ష

దీక్ష చేస్తున్న వివిధ పార్టీల నాయకులు

పాలమూరు, ఏప్రిల్ 12 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని అమరరాజా బ్యాటరీ పరిశ్రమకు వ్యతిరేకంగా పరిసార ప్రాంతాల గ్రామాలు ఎదిర, దివిటిపల్లి, అంబట్‌పల్లి, సిద్ధాయపల్లి గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాలుష్యం వెదజల్లే బ్యాటరీ పరిశ్రమ వద్దని, ఐటీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని చెప్పారు. దీక్షలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాములు, తిరుపతయ్య, ఈశ్వర్, బాలప్ప, భానుచందర్, యాదయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి తాగునీరు

ఊట్కూర్, ఏప్రిల్ 12 : ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం మండలంలోని బిజ్వారం, పెద్దజట్రం, అవుసలోనిపల్లి, పులిమామిడి, నిడుగుర్తి, లక్ష్మీపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎత్తిపోతల ద్వారా మండలంలోని 20వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శనివారం ఊట్కూర్‌లో నిర్వహించే పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి తరలిరావాలని కోరారు.

నేడు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమావేశం

మహ్మదాబాద్, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు గండీడ్ రైతువేదికలో నిర్వహించే సమావేశానికి ఉమ్మడి గండీడ్, మహ్మదాబాద్ ప్రధానోపాధ్యాయులు, వీవోఏలు, చైర్మన్లు, ఎంపీడీవో, ఏపీవో, ప్రత్యేకాధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆశప్రియ

ఆశ ప్రియ

మక్తల్ టౌన్, ఏప్రిల్ 12 : బీఆర్ఎస్ పాలమూరు పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్‌గా మక్తల్ పట్టణానికి చెందిన తిరుపతి ఆశప్రియను వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా పనిచేయాలని తెలిపారు.

సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన

ధన్వాడ, ఏప్రిల్ 12 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం సరస్వతీ మాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

బెల్టుదుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాజాపూర్, ఏప్రిల్ 12 : బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రవి హెచ్చరించారు. శుక్రవార